



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

స్థానిక చరిత్రలు రికార్డు చేయాలి

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి

ప్రజాశక్తి - అనంతపురం

నొళంబుల చరిత్రను రికార్డు చేయడం సిద్ధగిరి శ్రీనివాస్ చేసిన సాహసోపేతమైన ప్రయత్నమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన "నొళంబ వాడి" పుస్తకపరిచయసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతపురం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిచయ సభకు ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్. జెన్నె ఆనంద్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా బండి నారాయణస్వామి మాట్లాడుతూ మడకశిర ప్రాంతానికి చెందిన రచయిత సిద్ధగిరి శ్రీనివాస్ తన స్థానిక చరిత్రను రికార్డు చేయాలన్న ఒక తలంపులో నుంచి ఈగొప్ప చరిత్ర రచన పుట్టుకు వచ్చిందని, అది చరిత్రకు కొత్త చేర్పు అయిందని అన్నారు. చరిత్ర అధ్యయనం నానాటికి కుంటుపడుతోందని ప్రతి ఒక్కరూ చరిత్ర అధ్యయనంపై దృష్టి సారించాలని అన్నారు. సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ సిద్ధగిరి శ్రీనివాసుల సునిశితమైన పరిశీలన జ్ఞానమే ఈ పుస్తక రూపకల్పనకు దారితీసిందని, ఇలాంటి మరెన్నో పుస్తకాల రూపకల్పనకు ఆయన శ్రీకారం చుట్టాలని అన్నారు. 'ఫర్ ద సొసైటీ చారిటబుల్ ట్రస్ట్' వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల రాధాకృష్ణ మాట్లాడుతూ కవులు తమ రచనలతో ఈ సమాజానికి దిశా నిర్దేశం చేస్తున్నారని, యువత ఈ రచనల అధ్యయనం వైపు దృష్టి సారించాలని అన్నారు. 'అనంత విద్యావంతుల వేదిక' అధ్యక్షులు బండి నాగరాజు మాట్లాడుతూ మరుగున పడిన చరిత్రను వెలుగుపరిచిన సిద్ధగిరి శ్రీనివాస్ ఆదర్శనీయుడన్నారు. శేషగిరి రాయుడు మాట్లాడుతూ కాషాయీకరణలో భాగంగా నేడు చరిత్ర అంతా వక్రీకరించబడుతోందని నిక్కచ్చిగా చరిత్రను రికార్డు చేయాల్సిన అవసరం ఉందని, ఆ పని ఇటీవల కాలంలో సిద్ధగిరి శ్రీనివాస్ చేయగలిగారని అన్నారు. డాక్టర్ అంకె శ్రీనివాస్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ సిద్ధగిరి ఈ పుస్తక రూపకల్పనలో పడిన కష్టాన్ని, శ్రమని, ఆయన వెచ్చించిన సమయాన్ని, ఓర్పును వెలకట్టలేమని అన్నారు. ఈ పుస్తకం స్థానిక చరిత్రల రూపకల్పనలో మిగతా ప్రాంతాల ఔత్సాహిక రచయితలకు ఒక ప్రోత్సాహంగా నిలబడుతుందని అన్నారు. రచయిత సిద్దిగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతపు చరిత్ర ఆనవాళ్ళను వెతుకుతున్న క్రమంలో రాసుకున్న పుట్ నోట్సే ఈ పుస్తకమని అన్నారు. ఈసందర్భంగా అతిథుల చేతుల మీదుగా రచయితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లలిత కళా పరిషత్ అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య, జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులు కంబదూరి షేక్ నబీరసూల్, మధుర శ్రీ, కొత్తపల్లి సురేష్, కోటిగారి వన్నప్ప, తరిమెల అమర్నాథ్ రెడ్డి, గోవిందరాజులు, చేగువేరా హరి, జీ.విశ్వనాథ్ రెడ్డి, వలస రమేష్, తలారి రామాంజనేయులు, అడ్వకేట్ చంద్రాచెర్ల హరి, జూటూరు షరీఫ్, షేక్ రియాజుద్దీన్, అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'హంద్రీ నీవా'లో కదలికొచ్చేనా..?



హంద్రీనీవా కాలువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా వెడల్పు పనులు ముందుకు సాగుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీశైలం మాల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకు మొదటి దశలో ప్రస్తుతం 1800 క్యూసెక్కులు నీటి ప్రవాహం వస్తోంది. దీని వలన శ్రీశైలం డ్యామ్‌కు వరద వచ్చిన సమయంలోనూ అధికంగా నీరు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. 1800 క్యూసెక్కులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో వరద సమయాల్లో నీరు అధికంగా తీసుకునేందుకు వీలుగా హంద్రీనీవా కాలువ వెడల్పును ఆరు వేల క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. ఆరు వేల కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచి మెగా సంస్థకు పనులు అప్పగించారు. కాని పనుల్లో కదలిక మాత్రం ఆఖరు వరకు రాలేదు. ఫలితంగా 2020, 2021,2022 మూడు సంవత్సరాలు పెద్ద ఎత్తున వర్షాలొచ్చినా అధికంగా నీటిని తీసుకోలేని పరిస్థితి నెలకొంది.

అనేక ప్రాజెక్టులకూ సమస్య

హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, అదనంగా వచ్చే నీటి కేటాయింపులను కూడా ప్రభుత్వం చేసింది. శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని అనేక చెరువులకు నీటిని అందివ్వాలని నీటి కేటాయింపులు జరిపారు. అయితే కాలువ వెడల్పు పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఇవి పూర్తయితే తప్ప పైన పేర్కొన్న చెరువులకు నీరు వెళ్లదు. అంతేకాకుండా భైరవానితిప్పకు నీటిని అందించే పనులు జరగాల్సి ఉంది. దీంతోపాటు పేరూరు ఎత్తిపోతల పథకం, పుట్టపర్తి ఎత్తిపోతల పథకం, పిఎబిఆర్ కమ్యూనిటీ లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్ పనులు ముందుకు సాగలేదు.

కొత్త ప్రభుత్వమైనా పరుగులు పెట్టించేనా...

అభివృద్ధి నినాదంతో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. వాస్తవానికి 2018 సంవత్సరంలో టిడిపి హయంలోనే బిటిపి, పేరూరు ఎత్తిపోతల పథకాలకు టెండర్లు అయ్యాయి. కొంత వరకు పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి రివర్సు టెండరింగు పేరుతో పనులను కొంతకాలం నిలిపివేసింది. ఆ తరువాత భూసేకరణ సమస్య అంటూ పనులు చేపట్టలేదు. ఇప్పటికీ భూసేకరణ పూర్తవలేదు. పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు టిడిపి ఈ పనులను ఏ మేరకు ముందుకు తీసుకెళు తుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ ఈ పనులను ముందుకు తీసుకెళు తామని టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మొదలుకుని ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచార సమయంలో హామీలిచ్చారు. ఈ హామీలను ఏ మేరకు అమలు చేయగలుగుతారో చూడాల్సి ఉంది.

పెన్నోబిలేసుడిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ మండల పరిధిలోని పెన్నోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామిని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

హైదరాబాద్‌లో ఎమ్మెల్యే 'దగ్గుపాటి'కి ఘన స్వాగతం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలోనే కాకుండా హైదరాబాదులో కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఆయన తొలిసారిగా హైదరాబాద్ వెళ్లారు. దీంతో ఆయన శ్రేయోభిలాషులు, అభిమానులు, స్నేహితులు, అనంతపురం జిల్లాకు చెందినవారు పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన మైత్రి నగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలసి పూజల అనంతరం ఆయన్ని ఘనంగా సన్మానించారు. అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరగా బాణాసంచా కలుస్తూ, పూలవర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్నారు. పెద్దఎత్తున అనంతపురం వాసులు తరలిరావడంతో హైదరాబాద్ నగరంలోని రోడ్లలో సందడి వాతావరణం నెలకొంది. దగ్గుపాటి ఇంటి వరకూ ఈ ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ తనకి ఇంతటి స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అన్నారు. తన విజయం కోసం కేవలం అనంతపురం జిల్లాకు చెందిన పార్టీ నాయకులే కాకుండా హైదరాబాద్ నుంచి కూడా తన సన్నిహితులు వచ్చి పని చేశారని గుర్తు చేసుకున్నారు. తన విజయంలో వారికి కూడా భాగం ఉందని ఆయన అన్నారు. తనపై ఇంతటి అభిమానం చూపిస్తున్న వారిని ఎప్పటికీ మర్చిపోలేనన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘన స్వాగతం

చిలమత్తూరు : టిడిపి తరపున వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణ హిందూపురం వస్తున్న తరుణంలో కర్నాటకలోని బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ మేరకు టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, జనసేన చిన్నా, ప్రవీణ్ బాలయ్యకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. బాలయ్య మాట్లాడుతూ మీ అందరి ఆదరణ, ప్రేమాభిమానాల వల్లే నేను గెలుపొందానని, నియోజక వర్గాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాపై ఉందన్నారు. అనంతరం హిందూపురం బయల్దేరి వెళ్లారు. బాలయ్యకు స్వాగతం పలికేందుకు కార్యకర్తలు వేలాదిగా తరలి రావడంతో టోల్ గేట్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన కల్వర్టు

శిథిలావస్థలో హెచ్ఎల్‌సి కల్వర్టులు

దెబ్బతిన్న ప్రధాన కాలువ పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి - బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆంధ్ర సరిహద్దు 105 కిలోమీటర్ల నుండి 150 కిలోమీటర్ల వరకు 15 ప్రధాన రహదారి కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా ప్రధాన కాలువ కూడా పూర్తిస్థాయిలో దెబ్బతింది. కాలువలో కంపచెట్లు పెరిగిపోయాయి. గండ్లు పడ్డాయి. తుంగభద్ర జలాశయం నుంచి 2వేల క్యూసెక్కుల సాగునీరు ఇచ్చిన ఆంధ్రాలో కాలువ శక్తి సామర్థ్యాలు తగ్గిపోవడంతో 18వందల క్యూసెక్కుల నీటిని తీసుకునే సామర్థ్యం లేదని హెచ్ఎల్‌సి అధికారులు అంటున్నారు అంతేకాకుండా ప్రధాన కాలువల నుండి పొలాలకు వెళ్లే సాగునీటి కాలువలు చిన్న డిస్టిబూటర్లలో పూర్తిగా పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగిపోవటంతో పొలాలకు నీరందే పరిస్థితి కన్పించడం లేదు. ఈ విషయంపై రైతులు గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం కన్పించలేదు. నాగలాపురం, మైలాపురం, దర్గావన్నూర్, ఎర్రగుంట వద్ద ప్రధాన కాలువలు గండ్లు పడి నీరంతా వంకలు వాగుల్లోకి వెళ్లే పరిస్థితి ఉందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మైలాపురం వద్ద ఉన్న ప్రధాన కల్వర్టు మనుషులు పోవడానికి సైతం భయపడే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. 105 కిలోమీటరు నుండి 150 కిలోమీటరు వరకు సుమారు లక్ష ఎకరాలు సాగు భూములు ఉన్న వాటికి నీరు అందే పరిస్థితి లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధానకాలువతో పాటు, చిన్నకాలువలోల ఉన్న కంపచెట్లను తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, అలాగే శిథిలావస్థకు గురైన కల్వర్టుల స్థానంలో నూతన కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కోతకు గురైన హెచ్ఎల్‌సి

టిడ్కో ఇళ్లకు మహర్దశ వచ్చేనా..?

నూతన ప్రభుత్వమైనా కనికరించేనా..?
పేదల కల నెరవేరేనా..?
ఆరేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపు



కొటిపి వద్ద నిర్మాణ దశలోనే ఆగిన టిడ్కో గృహాలు

హిందూపురంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిర్మాణం చేసిన టిడ్కో గృహాలు నేటికీ లబ్ధిదారులకు అందలేదు. హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ 2018 జనవరి 10న ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పురపాలక సంఘాలలో టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే ఆ పనులు నేటికీ పూర్తి కాలేదు. పనులు పూర్తి అయిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించ లేదు. దీంతో పేదల సొంతింటి కల నెరవేరలేదు. దీంతో వేలాది మంది లబ్ధిదారులు నేటికి నిర్మాణం చేసిన టిడ్కో గృహాలను తమకు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో 16 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఉండడానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయలు అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కొటిపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహాల నిర్మాణ పనులను 2018 జనవరి 10న ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. ఆ సమయంలో మొదటి దశ కింద 2050 ఇళ్లు, రెండవ దశ కింద 6500 ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశారు. అందరికీ ఇళ్లు పథకం కింద టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో కేంద్రం, రాష్ట్రం ప్రభుత్వాలు సంయుక్తంగా జీ ప్లస్-3 తరహాలో అపార్టుమెంట్ల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు. 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్ధిదారుని వాటాతో ఇళ్లు నిర్మించ తలపెట్టారు. 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు పనులు మొదలు పెట్టారు. ఆ సమయంలో లబ్ధిదారులు ముందుకు రాక పోవడంతో అప్పటి పాలక వర్గం ప్రజలకు అవగాహన కల్పించి డిడిలు చెల్లించే విధంగా చూడడంతో కొంత మంది ముందుకు వచ్చి డిడిలు చెల్లించారు. ఇందులో క్యాటగిరిల వారిగా 300 చదరపు అడుగులకు 1104 మంది, 365 చదరపు అడుగులకు 1344, 430 చదరపు అడుగులకు 288 మంది మొత్తం 2736 మంది డిడిలు చెల్లించారు. ఇందులో 2516 మందికి ఇళ్లను కేటాయించారు. బ్యాంకు లింకేజీ క్రింద లబ్దిదారుల వాటాకు రుణాలను ఇప్పించడానికి మెప్మా వారికి అప్పగించడంతో 380 మందికి వివిధ బ్యాంకుల్లో రుణాలు సైతం వారు ఇప్పించారు. అయితే పనులు మాత్రం 2019 సార్వత్రిక ఎన్నికల మందు నుంచి ఆగిపోయాయి. పూర్తి అయిన టిడ్కో గృహాలను జగన్ ప్రభుత్వం ఉచితంగా లబ్దిదారులకు కేటాయిస్తామని చెప్పడంతో పాటు 2022 జూన్ లో లబ్దిదారులకు ఆ ఇళ్లను రిజిస్టర్ చేస్తున్నట్లు చెప్పి రిజిస్టర్ ప్రక్రియ సైతం చేపట్టారు. అయితే టిడ్కో గృహాల పనులు మాత్రం వైసిపి ప్రభుత్వం చేపట్టలేదు. ఇది చాలదన్నట్లు క్యాటగిరిల వారిగా టిడ్కో గృహాలను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. అయితే జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలైనా సకాలంలో పూర్తి లబ్దిదారులకు ఇచ్చారంటే అది లేదు.

ఉమ్మడి జిల్లాలో కేటగిరీల వారీగా రద్దయిన టిడ్కో గృహాలు....

ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఆధ్వర్యంలో మొదటి దశలో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. జిల్లాలోని అనంతపురం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చేపట్టిన టిడ్కో ఇళ్లకు సంబంధించి మొత్తంగా 7184 ఇళ్లను రద్దు చేశారు. ప్రధానంగా 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం జరిగింది. ఇందులో ఆ మూడు కేటగిరీల వారీగా పరిశీలిస్తే 300చదరపు అడుగులకు సంబంధించి 1472 ఇళ్లను రద్దు చేయగా, అందులో తాడిపత్రిలో 512, పుట్టపర్తిలో 288, కదిరిలో 96, హిందూపురంలో 384, గుత్తిలో 192 ఇళ్లు ఉన్నాయి. 365 చదరపు అడుగులకు సంబంధించి 3456 ఇళ్లను రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థల పరిధిలో 1008, తాడిపత్రిలో 240, గుంతకల్లులో 144, పుట్టపర్తిలో 288, పామిడిలో 720, కదిరిలో 48, హిందూపురంలో 960, గుత్తిలో 48 ఇళ్లు ఉన్నాయి. 430 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి మొత్తంగా 2256 ఇళ్లు రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థలో 1056, తాడిపత్రిలో 384, రాయదుర్గంలో 48, గుంతకల్లులో 192, పుట్టపర్తిలో 144, పామిడిలో 144, కదిరిలో 48, హిందూపురంలో 192, గుత్తిలో 48 ఇళ్లను ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది. వీరందరికి స్థలం కేటాయించారు. అయితే ఆ సమయంలో టిడ్కో గృహాల కోసం చెల్లించిన డిడిలు మాత్రం నేటికి తిరిగి ఇవ్వలేదు.

టిడిపి ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందా..?

2014లో అధికారంలోకి వచ్చే ముందు చంద్రబాబు నాయుడు ఇళ్లు లేని పేదలందరికి సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పారు. అదే విధంగానే టిడ్కో గృహ నిర్మాణాలను చేపట్టారు. అయితే 2019లో ప్రభుత్వం మారడం, అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం టిడ్కోను నిర్లక్ష్యం చేయడంతో టిడ్కో గృహాల సముదాయం కాస్తా అసాంఘిక కార్యక్రమాలను నిలయాలుగా మారాయి. అయితే తిరిగి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో టిడ్కోపై ప్రత్యేక దృష్టి సారించాల్సుంది. నిర్మాణాలు జరిగిన బ్లాక్‌లలో మౌళిక సదుపాయాలను కల్పించి లబ్దిదారులకు ఇవ్వడంతో పాటు వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన ఇళ్లను పునరుద్ధరించారు. ఆగిన పనులను ప్రారంభించి త్వరతగితిన పనులను పూర్తి చేసి లబ్దిదారులకు ఇచ్చే విధంగా చర్యలు చేపడితే వేలాది మందికి సొంతింటి కల నెరవేరుతుంది.



టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ (ఫైల్ ఫోటో)

రామోజీరావు మృతికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అక్షర యోధుడు, ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం పత్రికా లోకానికి తీరని లోటు అని ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ కొనియాడారు. ఆదివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పయ్యావుల ప్రవీణ్ మాట్లాడుతూ ఈనాడు, మార్గదర్శి, ప్రియా, మయూరి వంటి ఎన్నో సంస్థలు స్థాపించి లక్షల మంది జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు అన్నారు. ఆయన స్థాపించిన సంస్థల్లో నెలకొల్పిన క్రమశిక్షణ, ఆయన ఆదర్శాలు కొనసాగుతాయన్నారు.

ఈ కార్యక్రమమలో జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఆయుష్ తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాం, ఐజేఐ సభ్యులు ప్రభాకర్ నాయుడు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్షులు డానియల్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ రసూల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు జగదీష్, యూనియన్ ట్రెజరర్ చౌడప్ప, చలపతి, మల్లేష్, జిల్లాలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు, ఈనాడు యూనిట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈనాడు ఈటీవీ స్టాఫ్ రిపోర్టర్లు లక్ష్మీప్రసాద్ అంజప్ప, సీనియర్ జర్నలిస్టులు మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని సమైక్యాంధ్ర భవనంలో ఎపియుడబ్ల్యుజె కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు కమలాక్షుడి ఆధ్వర్యంలో ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీడియా రంగంలో ఎనలేని ప్రతిభ చాటిన రామోజీరావు చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రామోజీ ఫిలిం సిటీని తీర్చిదిద్దారన్నారు. అంతేగాకుండా చలనచిత్ర రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అనేకమంది కళాకారులను తయారు చేసిన గొప్ప మహనీయుడు రామోజీరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు రుద్రముని, కార్యనిర్వాహక కార్యదర్శి ఖాజా, ప్రచార కార్యదర్శి ఆవుల మనోహర్, విలేకరులు రామంజప్ప, వెంకటేశులు, శోభన్‌బాబు, శివకుమార్, రామాంజనేయులు, వీరన్న, రఘు, షఫీ, శివప్రసాద్, ఎపి ఎన్‌జిఒ తాలూకా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

అంత్యక్రియలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రామోజీ ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్వహించిన ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు అంత్యక్రియల్లో టిడిపి అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేష్‌తోపాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. శ్రీనివాసులు గతంలో ఈనాడు దినపత్రికలో విలేకరిగా పనిచేశారు. రామోజీరావు చొరవ వల్ల ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. రామోజీరావు కడసారి దర్శనం సందర్భంగా శ్రీనివాసులు గతాన్ని గుర్తు చేసుకున్నారు.

జెఇఇలో సత్యా అకాడమీ విద్యార్థి సత్తా



సత్తా చాటిన నందకిశోర్

అనంతపురం : ఐఐటీ జెఇఇ-2024 ఫలితాలలో నగరంలోని అరవింద నగర్ సత్య అకాడమీ విద్యార్థి జీవీఆర్ నందకిషోర్ అత్యుత్తమ ప్రతిభ తో సత్తా చాటాడు. సత్య అకాడమీలో శిక్షణ పొందిన నందకిషోర్ ఆల్ ఇండియాలో 8454వ ర్యాంకు సాధించి నా అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. సందర్భంగా సత్య అకాడమీ వ్యవస్థాపకులు కరెస్పాండెంట్ కాంతి దీప్ అకాడమీ సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

బయన్న స్వామికి ప్రత్యేక పూజలు

నార్పల : ఎన్డిఎ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ అవడం పట్ల మండలంలోని కర్ణపట్టి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి కార్యకర్త పోతుల హరికృష్ణ బయన్న స్వామికి 101 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టిడిపి నాయకులు ఆలం నరసానాయుడు, ఆలం వెంకటనరసానాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతుల రవికుమార్, బుసగాని గోపాల్, బయన్న, రాజా, సత్యమయ్య, పూజారి కృష్ణయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

పామిడి : అనారోగ్యంతో మృతిచెందిన 18వ వార్డుకు చెందిన బేగారి రవి కుటుంబానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు అండజేశారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని భార్య కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు, ఇద్దరు ఆడపిల్లలు, తల్లి వికలాంగురాలు కావడంతో నాయకులు చలించిపోయారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు రూ.12వేల ఆర్థికసాయం అందించారు. రాబోయే రోజుల్లో రవి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లు శ్రీనివాసరెడ్డి, గౌస్‌పీరా, నల్లబోతుల శీన, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కొట్నూరు చెరువులో చేపలు మృత్యువాత.!

ప్రజాశక్తి-హిందూపురం

'పట్టణ పరిధిలోని కొట్నూరు చెరువులో పెద్దఎత్తున చేపలు మృత్యువాత పడ్డాయి. ఇందుకు కలుషమా..? లేక మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణమా అనే విషయం అర్థం కావడం లేదు. మొత్తానికి చెరువులో ఉన్న చేపలన్నీ మృతి చెంది దుర్వాసన వెదజల్లుతున్నా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల పలువురు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు'.

కాలుష్యమా.. మత్స్య శాఖ నిర్లక్ష్యమా..?



కొట్నూరు చెరువులో మృత్యువాత పడిన చేపలు

హిందూపురం పురపాలక సంఘంలోని కొట్నూరు చెరువులో ఆ వార్డ్ కౌన్సిలర్ అండదండలతో తమిళనాడు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అనధికారికంగా చేపలు పడుతున్నారు. ఈ విషయంపై గత ఏడె నెలలో అన్ని వివరాలతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం రూపంలో వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలో సకాలంలో స్పందించి బహిరంగ వేలం వేయాల్సిన మత్స్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు తమకు బహిరంగ వేలం నిర్వహించాలని, మున్సిపల్ శాఖ పరిధిలో ఉండటంతో మున్సిపల్ కమిషనర్ బహిరంగ వేలం వేస్తారని పేర్కొన్నారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్‌ను ప్రజాశక్తి కలిసి సమస్యను వివరించింది. ఆయన వెంటనే మత్స్య శాఖ అధికారులను పిలిపించి నిబంధనల మేరకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆదేశించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు ఎన్నికలు ముగిసిన వెంటనే బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్‌తో పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం చెరువులో ఉన్న చేపలన్నీ మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చెరువులోని కాలుష్యం వల్ల చేపలు మృతి చెంది ఉంటే గతంలోనే మృతి చెందాలి. అలా కాకుండా మరికొన్ని రోజుల్లో కొట్నూరు చేపల చెరువును బహిరంగ వేలం వేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా చేపలు మృతి చెందడం వెనక ఎవరో విష ప్రయోగం చేసి ఉంటారన్న అనుమానాలు కొట్నూరు ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మత్స్య శాఖ ఉన్నతాధికారులతో విచారణ జరిపిస్తే సమగ్ర వివరాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏదైమైనా కొట్నూరు చెరువులో ఒక్కసారిగా చేపలు మృతి చెందడంతో పట్టణంతో పాటు హిందూపురం-పెనుకొండ రహదారిపై దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతును గౌరవిస్తేనే దేశాభివృద్ధి

'రైతు మారాజు' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

రైతు అంటే వ్యవసాయం.. వ్యవసాయం అంటే రైతు... అలాంటి రైతును గౌరవించినప్పుడే ఆ దేశం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఎస్‌కెయు తెలుగు ఆచార్యులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన ఎపి అభ్యుదయ రచయితల సంఘం మార్తాటి ఈశ్వరీ గోపాలరావు రచించిన రైతు మా రాజు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుగా అవిశ్రాంత అక్షర యోధుడు, తెలుగువారి ఆత్మ బంధువు, బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, విమర్శకులు, పుస్తక సమీక్షకులు తూముచర్ల రాజారామ్ మాట్లాడుతూ రైతు మారాజు కావ్యం నిండా నిరంతరం కష్టపడే రైతు జీవితం అన్నారు. మట్టివాసన, పల్లెటూరు సోయగాలు, రైతును ముడిపెట్టిన జీవితం కనిపిస్తుందన్నారు. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రచయిత ఈ కావ్యం ద్వారా రైతు నూతన సాంకేతిక వ్యవసాయంలో నవీన పద్ధతుల్ని చేపట్టాలని కోరారన్నారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న మాట్లాడుతూ రైతు మారాజు కావ్యం పశు సంపద, దేశ సంపద గా కీర్తించడం సంతోషకరమన్నారు. అంతేగాకుండా ఎరువుల కల్తీని ఎండగట్టారన్నారు. గౌరవ అతిథి సి.రాము మాట్లాడుతూ గోపాల్‌రావు కవి మాత్రమే కాదని, మంచి సామాజిక నాటకాలు రాసి ప్రజల్లో చైతన్యవంతం తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. రైతు మారాజు రచయిత మార్తాటి ఈశ్వరీ గోపాలరావు తన స్పందన తెలియజేస్తూ కరువుకు కారణం వర్షాలు రాకపోవడమే కాదు.. కర్షక వృత్తి భంగం కావడం కూడా అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏ దేశం రైతును గౌరవిస్తుందో.. ఆ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి, తెలుగు వెలుగు వ్యవస్థాపక అధ్యక్షులు టివి.రెడ్డి, ఎపి అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, సౌరపు గోవిందరాజులు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఎస్‌ఎం.బాషా, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, ఒంటెద్దు రామలింగారెడ్డి, అంకె రామలింగమయ్య, ఆలిండియా రేడియో హేమంత్ రాజు, దాసన్నగారి కృష్ణమూర్తి, మార్తాటి ఈశ్వరి గోపాలరావు కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



'రైతు మారాజు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

అక్రమంగా నిర్మించిన భవనాన్ని స్వాధీనం చేసుకోవాలి

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘానికి కేటాయించిన ఖాళీ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సమైక్యాంధ్ర భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగులకు కేటాయించిన స్థలంలో అక్రమంగా ప్రవేశించి వారి బేస్మెంట్‌పై నిర్మాణం చేయడం దౌర్జన్యానికి పరాకాష్ట అన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా అనుమతులు లేకుండా కేవలం గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల అండదండలతో నిర్మించారన్నారు. ఈ విషయంలో నూతన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెంటనే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ మాట్లాడుతూ ప్రశాంతమైన ఈ ప్రాంతంలో అధికారులుగా ఉండి రిటైర్డ్ అయిన వ్యక్తులు దారుణానికి పాల్పడం తగదన్నారు. వెంటనే ఆ భవనాన్ని సొంతదారులైన నాలుగో తరగతి ఉద్యోగులకు స్వాధీనం చేయాలని కోరారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షులు డి.రామాంజనేయులు మాట్లాడుతూ తమ సంఘం నుంచి విడిపోయిన కొందరు అక్రమంగా భవనం నిర్మించారన్నారు. వారికి గుర్తింపు లేదని జిల్లా సంఘం ఇచ్చిన లేఖను ప్రదర్శించారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏర్పాటు

రాయదుర్గం తాలూకా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి డి.చంద్రమోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక సమైక్యాంధ్ర భవన్‌లో నాలుగో తరగతి ఉద్యోగులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా మినుగుల విజయ్, ప్రధాన కార్యదర్శిగా హెచ్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా రఫిక్, సావిత్రమ్మ, లోకేష్, ఉప కార్యదర్శిగా కిష్టప్ప, సరోజమ్మ తదితరులు ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరి పదవి మూడేళ్ల పాటు ఉంటుందన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. తర్వాత సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు హనుమాన్, పరమేశ్వరప్ప, రామాంజనేయ, రామాంజనేయులు, పెన్షన్ సంఘం కార్యదర్శి సత్యనారాయణ, చిదానంద, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాలుగవ వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి

మహమ్మద్ అబ్దుల్‌రషీద్ సేవలు మరువలేనివి : ఆల్‌మేవా

ప్రజాశక్తి-అనంతపురం

ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మే వా) వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్‌రషీద్ మైనార్టీ ఉద్యోగ వర్గాలకు చేసిన సేవలు మరువలేనివని ఉభయ జిల్లాల కోర్ కమిటీ సభ్యులు కొనియాడారు. ఆదివారం ఉదయం ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఎంఎ.రషీద్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేవా నాయకులు షేక్షావలి, ఫారూఖ్ అహ్మద్ మాట్లాడుతూ జూన్ 3న నల్గొండ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఎంఎ.రషీద్ గుండెపోటుతో మృతిచెందడం బాధాకరన్నారు. ఉభయ రాష్ట్రాల్లో ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ బలోపేతంతోపాటు మైనారిటీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రషీద్ ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా వీరు గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా చిత్తూరు, పాడేరు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ విధులు నిర్వర్తించి ఆ శాఖకు వన్నె తెచ్చారన్నారు. వీరు చేసిన సేవలను గుర్తించి 1999లో ప్రత్యేకంగా అవార్డు ప్రధానం చేశారని గుర్తు చేశారు. ముస్లిం రిజర్వేషన్ల సాధన ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. సామాజిక కార్యక్రమాల్లో తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ మంచితనానికి మారుపేరుగా అందరి మన్ననలు పొందారన్నారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో ఆల్ మేవా సంఘం ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు, సెక్రటేరియట్ మసీదు నిర్మాణంలో భాగస్వామ్యం, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజల అభ్యున్నతికి, నిరుద్యోగ యువతను ఉత్తేజం చేసే ఉపన్యాసాలు, ఉచితంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ తదితర కార్యక్రమాలకు రషీద్ తనవంతు సేవలు అందించారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ మేవా నాయకులు ఫక్రుద్దీన్, ఎంఎం.బాషా, దౌలా, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేసి నివాళులర్పిస్తున్న ఆల్‌మేవా నాయకులు

జెఇఇ ఫలితాల్లో 'నారాయణ' ప్రభంజనం

22ఏళ్ల రికార్డును తిరగరాసిన విద్యార్థులు : డీన్ బద్రీనాథ్

ప్రజాశక్తి-అనంతపురం

జెఇఇ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఐఐటిల్లోని ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరడానికి నిర్వహించిన జెఇఇ పరీక్ష ఫలితాల్లో జి.శశికిరణ్ 234 మార్కులు, 65 శాతం పర్సంటేజీతో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 982 ర్యాంకు సాధించి చరిత్ర సృష్టించినట్లు కళాశాల కోర్ డీన్ బికె బద్రీనాథ్ తెలిపారు. ఇదే విద్యార్థి జెఇఇ మెయిన్‌లో ఓపెన్ క్యాటగిరీలో 1830, తెలంగాణ ఎంసెట్‌లో 437 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థి ప్రతిభ, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, నారాయణ కరికులం వల్ల అత్యుత్తమ ర్యాంకు సాధ్యపడిందన్నారు. అలాగే కళాశాలకు చెందిన సి.మేఘన 4124 ర్యాంకు, జి.మోహన్‌ప్రదీప్ 4657 ర్యాంకు, అజయ్ కృష్ణారెడ్డి 5287, సిద్ధార్థరెడ్డి 16145, అసిమ్‌ఖాన్ 17929 అఖిల భారత ర్యాంకులు సాధించగా, జి.దీపిక 2241, డి.స్తుతి ప్రశంసిని 3713, పి.రేణుక 4658 ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి క్వాలిఫై అయ్యారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనా సిబ్బందికి కళాశాల డీన్ శ్రీనివాస్‌రెడ్డి, డిజిఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, హిమబిందు, శిఖామణి, లక్ష్మన్న, జయలక్ష్మి, బాలన్న పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

'కూటమి' విజయోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాయదుర్గం పట్టణంలో కూటమి ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు.

ఇందులో భాగంగా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జింకా వసుంధరాదేవి, హీరోజీరావుతో పాటు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడంతో జనసేన మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ సర్కిల్‌లో బాణాసంచా పేల్చి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసినివాళు లర్పించారు. అనంతరం కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి గెలవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని వస్తుందన్నారు. అంతేగాకుండా అభివృద్ధి జరుగుతుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఇంతటి విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు త్రివేదినాయుడు, శివ, బిజెపి మండల అధ్యక్షులు వన్నూరుస్వామి, నాయకులు మనోహర్, జనసేన ఉపాధ్యక్షులు మధు, నాయకులు కృష్ణ, నాని, రవినాయక్, శేఖర్, గుండునాయక్, రుద్రస్వామినాయక్, రామమూర్తి, అజయ్, గణేష్, మారుతి, మారుతీప్రసాద్, చంద్రానాయక్, తదితరులు పాల్గొన్నారు



బెలుగుప్పలో కేక్ కోస్తున్న జనసేన నాయకులు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

కళ్యాణదుర్గం : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని మంగలకుంట గ్రామానికి చెందిన కురుబ నాగరాజు (37) వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. నాగరాజు పదేళ్ల క్రితం ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో వివాహం చేసుకుని అక్కడే కాపురం ఉంటున్నాడు. ఈనేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ఎన్నికల సందర్భంగా భార్య జ్యోతి, పిల్లలతో కలిసి మంగలకుంటకు వచ్చాడు. పోలింగ్ అనంతరం భార్య కుమారుడు తిరిగి స్వగ్రామానికి వెళ్లగా మద్యానికి బానిసమైన నాగరాజు వెళ్లలేదు. స్వగ్రామంలోనే కాపురం పెట్టుకుందామని నాగరాజు భార్యను నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అయినా ఆమె వినలేదు. దీంతో మద్యం మత్తులో తీవ్ర మనస్థాపానికి గురై వ్యవసాయ తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. అదేవిధంగా దిగువ తండాకు చెందిన చంద్రానాయక్ (42) మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చంద్రానాయక్ గత కొనేళ్లుగా భార్య భానూబాయితో గొడవపడే వాడు. ఈ క్రమంలోనే తీవ్ర మనస్థాపానికి గురైన చందానాయక్ ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. భార్య కుమారుడు ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ముందు వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. దీంతో రోడ్డు పక్కన కూర్చున్న రంగారెడ్డి (48) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... గూగూడు రోడ్డు నుంచి నార్పల వైపు మట్టితో వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకొచ్చింది. దీంతో రోడ్డు పక్కన కూర్చున్న రంగారెడ్డి, ధనుంజయ తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే స్థానికులు, బంధువులు వైద్యం కోసం 108 ద్వారా అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రంగారెడ్డి మృతిచెందాడు. ధనుంజయ చికిత్స పొందుతున్నారు. కాగా ప్రమాదానికి కారణం ట్రాక్టర్ అతివేగమే అని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఇఎంటి చంద్రమౌళి, 108 పైలెట్ రాజశేఖర్ తెలిపారు.


వ్యాపారి ఆత్మహత్య



మృతిచెందిన ముఖేష్‌కుమార్

పుట్లూరు : అప్పుల బాధ తాళలేక ఓ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండల పరిధిలోని సంజీవపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంజీవపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు ఉమ్మడి ముఖేష్‌కుమార్‌రెడ్డి (27) మూడేళ్లుగా అరటికాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈనేపథ్యంలో వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులు చేశారు. ఈనేపథ్యంలో అప్పుల బాధ తాళలేక శనివారం మరుగుదొడ్లు శుభ్రం చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమణించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషయమించి మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతిచెందిన తిరుపాల్‌రెడ్డి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో బ్రిడ్జి వద్ద వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు వివరాలు మేరకు.. యల్లనూరు మండలం పాతపల్లికి చెందిన తిరుపాల్‌రెడ్డి (60) ముచ్చుకోట బ్రిడ్జి వద్ద భోజనం చేసిన తర్వాత మృతిచెందిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. మొదట గుర్తు తెలియని శవంగా భావించినా తర్వాత కుటుంబ సభ్యులు తెలుసుకుని పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హమానుల్లా అశోక్‌కుమార్ తెలిపారు. వివరాలు పోస్టుమార్టం అనంతరం తెలియనున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని ఊబిచెర్ల గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నాటక కు చెందిన అనంతరెడ్డి హైదరాబాద్ నుంచి గుల్బర్గాకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఊబిచెర్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రిని తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

పుట్టపర్తి క్రైమ్ : మండల పరిధిలోని కంబాలపర్తి గ్రామ సమీపంలో ఆదివారం సాయంకాలం 4 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న మెకానిక్ కిరణ్ ద్విచక్ర వాహనంపై ముగ్గురు నల్లమాడ నుంచి పుట్టపర్తికి వస్తుండగా పుట్టపర్తి నుంచి నల్లమాడకు మరో ద్విచక్ర వాహనం అన్నాచెల్లెలు వెళుతుండగా మార్గమధ్యలో కంబాలపర్తి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కిరణ్‌తో పాటు మరొక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కిరణ్ తలకు, కాలికి బలమైన గాయాలయ్యాయి. పుట్టపర్తి నుంచి నల్లమాడకు తిరిగి వెళ్తున్న రామాంజనేయ కాలు విరిగిపోయింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

పుట్టపర్తి క్రైమ్ : కుక్కల దాడిలో నాలుగు గొర్రెపిల్లలు మృత్యువాత పడిన సంఘటన ఆదివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లిలో జరిగింది. బాధితుడు రామచంద్ర తెలిపిన వివరాలు.. ఇంటి పక్కనే దొడ్డిలో గొర్రెలను ఉంచగా ఊర కుక్కలు దాడి చేసి నాలుగు గొర్రె పిల్లలను చంపి వేశాయన్నారు. తాను నిరుపేదనని గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానన్నారు. సుమారు రూ. 25వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

ఇక 'ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం'

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలో గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియాన్ని ఆదివారం ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంగా పేరు మార్చారు. 2019లో వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంగా పేరు మార్చడంతో పాటు రంగులు మార్చిందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే ఎస్.సవితమ్మ ఆదేశాల మేరకు ఆదివారం గతంలో ఉన్న విధంగానే దానికి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంగా పేరు మార్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అనంత' జిల్లాకు సత్యసాయి సేవలు మరువలేనివి

పుట్టపర్తి అర్బన్ : ఉమ్మడి అనంతపురం జిల్లాకు సత్యసాయి అందించిన సేవలు మరువలేనివని అనంతపురం జిల్లా సత్యసాయి సేవా సమితి కోఆర్డినేటర్ నరసింహమూర్తి పేర్కొన్నారు. దాదాపు 2500 మంది భక్తులు పర్తి యాత్రగా వచ్చిన అనంతపురం జిల్లా వాసులు రెండో రోజైన ఆదివారం సాయి కుల్వంత్ హాలులో ప్రత్యేక భజనలు చేశారు. ఆయన మాట్లాడుతూ కరువు జిల్లాకు సత్యసాయి ట్రస్టు విద్య, వైద్యం, తాగునీరు అందిస్తోందన్నారు. ప్రభుత్వాలు చేయలేని పనులను సత్యసాయి ట్రస్టు చేపట్టడం స్ఫూర్తిదాయక మన్నారు. పర్తి యాత్రగా సత్యసాయి మహా సమాధి చెంతకు రావడం ఆనందంగా ఉందన్నారు.